క్లుప్తంగా

నెల్లుట్లలో ఎమ్మెల్యే పర్యటన

లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్లలో మంగళవారం రాత్రి పల్లెనిద్ర చేసిన ఎమ్మెల్యే రాజయ్య బుధవారం గ్రామంలో సమస్యలను తెలుసుకున్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నల్ల అబ్బయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మోటె వీరస్వామి, పీఏసీఎస్ డైరెక్టర్ బాలరాజు, గోవర్ధన్, గంగాధర్, ఆనంద్, రాహుల్ పాల్గొన్నారు.

మామిడి తోట దగ్ధం.. రూ.4లక్షల నష్టం



జనగామ రూరల్: జనగామ మండలం పెద్దపహాడ్‌లో రైతు ధర్మ దేవేందర్‌రెడ్డికి చెందిన రెండెకరాల మామిడి తోట బుధవారం ప్రమాదవశాత్తు కాలిపోయింది. వరిపంట కోసిన తర్వాత వదిలేసిన కొయ్యకాళ్ల(గడ్డి మొదళ్లు)కు నిప్పంటుకుని.. చుట్టపక్కల మంటలు వ్యాపించాయి. సమీప రైతులు గుర్తించి అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చారు. అప్పటికే పక్కనే ఉన్న మామిడి తోటలోని సుమారు రెండు వందల చెట్లకు నిప్పు అంటుకోగా, డ్రిప్ పైపులు, విద్యుత్ సర్వీసు వైర్లు పూర్తిగా కాలిపోయాయి. రూ.4లక్షల వరకు నష్టం వచ్చిందని రైతులు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది గంటకు పైగా కష్టపడి మంటలను అదుపులోకి తెచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

స్టేషన్‌ఘన్‌పూర్: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టిన ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న జంగా రాజిరెడ్డి, గుర్రం ప్రేమ్‌కుమార్ గాయపడిన సంఘటన బుధవారం సాయంత్రం స్టేషన్‌ఘన్‌పూర్‌లో జరిగింది. ఏఎస్‌ఐ రాజమౌళి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక ఆర్‌టీసీ కాలనీలో జంగా రాజిరెడ్డి నూతనంగా గృహ నిర్మాణం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో మండలంలోని శివునిపల్లికి చెందిన గుర్రం ప్రేమ్‌కుమార్‌కు పేయింటింగ్ పనులను అప్పగించాడు. సాయంత్రం రాజిరెడ్డి, ప్రేమ్‌కుమార్ ఘన్‌పూర్ బస్టాండ్ సమీపానికి బైక్‌పై వచ్చి పేయింట్ డబ్బాలు తీసుకుని వెళ్తున్నారు. స్థానిక ఆర్ ఆర్ దాబాహోటల్ సమీపాన ఉన్న యూటర్న్ వద్ద యూటర్న్ తీసుకుని ఆర్‌టీసీ కాలనీకి వచ్చేందుకు బస్టాండ్ నుంచి హైదరాబాద్ రోడ్డుకు వెళ్తుండగా హనుమకొండ నుంచి వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. రాజిరెడ్డి హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ప్రేమ్‌కుమార్ ఘన్‌పూర్‌లో చికిత్స పొందుతున్నాడు. కాగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

డీసీఎం బోల్తా..

రఘునాథపల్లి: హనుమకొండ–హైదరాబాద్ జాతీయ రహదారిలోని గోవర్ధనగిరి దర్గా వద్ద డీసీఎం వ్యాన్ అదుపుతప్పి బోల్తాపడి డ్రైవర్‌కు గాయాలైన ఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. వరంగల్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న డీసీఎం గోవర్ధనగిరి దర్గా వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. దీంతో మహారాష్ట్ర నాందేడు జిల్లా గోగ్రి గ్రామానికి చెందిన డ్రైవర్ ఆకాశ్‌కు స్వల్ప గాయలయ్యాయి. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని, విచారణ చేపట్టనున్నట్లు పోలీసులు తెలిపారు.

తాటిచెట్టుపై పడిన పిడుగు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండ శివారులో తాటిచెట్టుపై పిడుగు పడిన సంఘటన బుధవారం సాయంత్రం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని బుధవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఈక్రమంలో తాటికొండ శివారులోని గాలిగుట్ట వర్రె వద్ద ఉన్న తాటిచెట్టుపై ఒక్కసారిగా పిడుగుపడింది. ఆ సమయంలో అక్కడ ఎవ్వరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరుగలేదు.

పచ్చిచొప్ప తిని పశువులు మృతి

చిల్పూరు: మండలంలోని కృష్ణాజీగూడెంలో జక్కుల కుమార్‌కు చెందిన పశువులు పచ్చిచొప్ప తిని బుధవారం మృతి చెందాయి. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. రోజు మాదిరిగా ఉదయం మేత కోసం పశువులను వదిలాడు. అందులో రెండు పాడి ఆవులు ఆకలికి పచ్చజొన్న చొప్ప ఇగురు తిని మృతి చెందాయి. దీంతో రూ. లక్ష 30వేల నష్టం వాటిల్లిందని రోధించాడు. బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం నాయకుడు రమేష్, బీఆర్‌ఎస్ నాయకులు అధికారులను కోరారు.

‘దిశ’ జిల్లా కమిటీ సభ్యురాలిపై పోలీసులకు ఫిర్యాదు

లింగాలఘణపురం: మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకురాలు, దిశ జిల్లా కమిటీ సభ్యురాలు గుడుగుల భాగ్యలక్ష్మిపై నెల్లుట్లకు చెందిన నల్ల బాబురావు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉదయం ఎమ్మెల్యే రాజయ్య ప్రజా నివేదన యాత్రలో భాగంగా నెల్లుట్లలో పర్యటించి వెళ్లిపోయిన అనంతరం బాబురావు భాగ్యలక్ష్మి మధ్య దూషణల పర్వం కొనసాగింది. దీంతో బాధితుడు బాబురావు ఆమెపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయంపై ఎస్సై ప్రవీణ్‌ని వివరణ కోరగా ఫిర్యాదు అందిందని, విచారణ చేపడతామని చెప్పారు.

దేవరుప్పుల: పూజలో ఎంపీపీ సావిత్రి తదితరులు



జనగామ: గుండ్లగడ్డ ఉమామహేశ్వర ఆలయంలో..



జనగామ:ఉప్పలమ్మ ఆలయ గోశాలలో పూజలు



జనగామ: చర్చిలో ప్రార్థనల అనంతరం సత్కారం



ఆధ్యాత్మిక చింతన ఉండాలి

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లా వ్యాప్తంగా ఆధ్యాత్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో పూజలు, మసీదు, చర్చిల్లో ప్రార్థనలు చేపట్టారు. చిల్పూరులో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ శివలింగయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో ఉండాలని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, బీఆర్‌ఎస్ నాయకులు, అర్చకులు, అంగన్‌వాడీలు, ఏఎస్‌ఎంలు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

-సాక్షి నెట్‌వర్క్



చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివలింగయ్య



నర్మెట: మసీద్‌లో నమాజ్



బచ్చన్నపేట: పూజలో ఎంపీడీఓ రఘురామకృష్ణ, అధికారులు, నాయకులు



జనగామ రూరల్: ఆలయంలో పూజ చేస్తున్న ఎంపీపీ కళింగరాజు



రఘునాథపల్లి: ఇబ్రహీంపూర్ శివాలయంలో..



కొడకండ్ల: శివాలయంలో.. ప్రజాప్రతినిధులు



లింగాలఘణపురం: జీడికల్‌లో..

కురుమ సంఘం జిల్లా కమిటీ



మోటె శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు

జనగామ: జనగామ కురుమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా మోటె శ్రీనివాస్, ఆలేటి సిద్ది రాములును ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. వారికి రాష్ట్ర అధ్యక్షుడు యెగ్గె మల్లేశం, ఉపాధ్యక్షుడు సేవెల్లి సంపత్, జిల్లా అధ్యక్షుడు కంచె రాములు బుధవారం నియామక పత్రాన్ని ఇచ్చారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా జాయ మల్లేషం, జాయింట్ సెక్రెటరీ నోముల సోమయ్య, మంగ సత్యనారాయణ, పిక్క బీరప్ప, అసిస్టెంటు సెక్రెటరీ బోరెల్లి సిద్దులు, బాల్దె ఆంజనేయులు నియామకమయ్యారు.

కాంగ్రెస్ శివునిపల్లి కమిటీ..

స్టేషన్‌ఘన్‌పూర్: శివునిపల్లి కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నీల రాములుముదిరాజ్ ఎన్నికయ్యారు. నూతన కమి టీని పార్టీ జిల్లా కార్యదర్శి మేకల మల్లేశం, జిల్లా ఓబీసీ సెల్ జాయింట్ కోఆర్డి నేటర్ కోల శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు కుంభం ఉపేందర్ ఆధ్వర్యంలో బుధవారం ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా గుర్రం సోమయ్య, ప్రధాన కార్యదర్శిగా మేడబోయిన సమ్మయ్య, సహాయ కార్యదర్శులుగా పింగిలి భిక్షపతి, గుర్రం శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా కొండ సమ్మయ్య, కోశాధికారిగా మేస్త్రీ యాదగిరి, గౌరవ అధ్యక్షులుగా నీల బిక్షపతి, నీల లింగం, గుర్రం దేవయ్య, గౌరవ సభ్యులుగా నాగబండి వెంకట్రాంనర్సయ్య, పడకంటి క్రిష్ణమూర్తి, శ్రీనివాస్‌రెడ్డి, నీల రాజు, బైరపాక యాదగిరి, నీల సమ్మయ్య, మైనార్టీ సెల్ గ్రామ అధ్యక్షుడిగా ఎండీ.షాకీర్ ఎన్నికయ్యారు.

మెగా వైద్యశిబిరం

జనగామ: పట్టణంలోని హైదరాబాద్ రోడ్డున ఉన్న వేద ఆయుర్వేద పంచకర్మ, వెల్‌నెస్ ఆస్పత్రిలో డాక్టర్ అంజిరెడ్డి ఆధ్వర్యాన బుధవారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. పక్షవాతం, ఆర్థో, స్కిన్, పైల్స్ తదితర రోగాలకు సంబంధించి అవసరమైన ఎక్స్‌రే, రక్త పరీక్షలు చేసి 60 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రావ్య, వైద్య ఇబ్బంది అర్పిత, వెంకటేశ్, సాయి, లలితతో పాటు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధిలో పెంటయ్య పాత్ర కీలకం

జనగామ రూరల్: జనగామ పట్టణ అభివృద్ధిలో ఆకుల పెంటయ్య పాత్ర కీలకమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని గ్రెయిన్ మార్కెట్ వద్ద పెంటయ్య విగ్రహావిష్కరణ కరపత్రాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు. సాంబరాజు యాదగిరి, రాపర్తి రాజు, గోపి, ప్రకాష్, ఆజార్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

రవి కుటుంబానికి అండగా ఉంటాం..

జఫర్‌గఢ్: రజక సంఘానికి ఎంతగానో సేవలందించి అకస్మికంగా మృతి చెందిన సాంబ రాజు రవి కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జాతీయ కన్వీనర్ నడిమింటి శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో హిమ్మత్‌నగర్‌లో రవి సంస్మరణ సభను బుధవారం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు గోపితోపాటు తదితరులు పాల్గొన్నారు.

జయశంకర్ ఆశయాలను కొనసాగించాలి



నివాళులర్పిస్తున్న విశ్వబ్రాహ్మణ సభ్యులు

జనగామ రూరల్: ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలు కొనసాగించాలని విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం జిల్లా అధ్యక్షుడు దిగోజు నర్సింహాచారి అన్నారు. జయశంకర్ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పట్టణ కార్పెంటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దిగోజు సాంబయ్య, ఉపాధ్యక్షుడు బత్తోజు సిద్దిరాములు, యూత్ అధ్యక్షుడు ఎస్ రాజు, నవీన్, మహిళ అధ్యక్షురాలు గంగాభవాని, వీరాచారితోపాటు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ స్వర్ణకార ఆధ్వర్యంలో..

పట్టణ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో పాతబీటు బజార్‌లో జరిగిన వర్ధంతి సభలో అధ్యక్షుడు నారోజు రామేశ్వరాచారి, ఆంజనేయులు, ఆనంద్, వెంకటేశ్వర్లు. వెంకటరమణతోపాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్ సార్‌కు ఘన నివాళి

దేవరుప్పుల: మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ బస్వ సావిత్రి, ఎంపీడీఓ సురేష్‌కుమార్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి టౌన్: పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో పాలకుర్తి మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మండల విశ్వబ్రాహ్మణ అధ్యక్షుడు అబ్బోజు యాకస్వామి, రాజేంద్ర చారి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

యోగా అలవాటు చేసుకోవాలి

సీజేఐటీ డైరెక్టర్ ఫాదర్ విజయ్‌పాల్‌రెడ్డి

జనగామ: ప్రస్తుత బిజీ జీవితంలో ప్రతి ఒక్కరూ దైనందిన జీవింతలో యోగా అలవాటు చేసుకుని సంపూర్ణ ఆరోగ్యం పొందాలని క్రీస్తు జ్యోతి ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్, ఫాదర్ డి.విజయ్‌పాల్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా శిక్షకులు గీతేష్ బజాజ్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యోగా ప్రాముఖ్యత గురించి వివరించడంతో పాటు విద్యార్థులు, అధ్యాపకులచేత ఆసనాలు వేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు స్వప్న, ప్రభాకర్, సంతోష్‌కుమార్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న డైరెక్టర్ విజయ్‌పాల్‌రెడ్డి

ముగింపు ఉత్సవాలకు ముస్తాబు

దేవరుప్పుల: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల ముగింపు పురస్కరించుకొని మండల పరిషత్ కార్యాలయం వద్ద తలపెట్టిన తెలంగాణ అమర వీరుల స్మారక చిహ్నం ఆవిష్కరణకు ముస్తాబు చేస్తున్నారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సూచనల మేరకు ఎంపీపీ బస్వ సావిత్రి మల్లేషం, జెడ్పీటీసీ పల్ల భార్గవి సుందర్‌రామిరెడ్డి ఆధ్వర్యంలో మలివిడత తెలంగాణ ఉద్యమ సాధనలో అసువులుబాసిన అమరులను నిత్యం కొలిచేలా స్మారక చిహ్నం, పార్కును ఏర్పాటు చేశారు. నేడు(గురువారం) ఉదయం 10 గంటలకు స్మారక చిహ్నాన్ని మంత్రి దయాకర్‌రావు ఆవిష్కరించడమేగాక ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో భాగస్వాములైన కీలక వ్యక్తులకు గౌరవార్ధం సన్మానించనున్నట్టు వారు తెలిపారు.



అమరవీరుల స్మృతిపార్కు

అవమానించడం బాధాకరం



మాట్లాడుతున్న చిరంజీవి, శ్రీరాములు

స్టేషన్‌ఘన్‌పూర్: రంగరాయగూడెంలో అంగన్‌వాడీ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రొటోకాల్ పాటించకుండా దళిత మహిళా సర్పంచ్‌ను అవమానించడం చాలా బాధాకరమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ డాక్టర్ చేపూరి చిరంజీవి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నల్లా శ్రీరాములు అన్నారు. రంగరాయగూడెంలో సర్పంచ్ అనూష నివాసం వద్ద బుధవారం వారు విలేకర్లతో మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్ర నిర్మాణం ప్రభుత్వ స్థలంలో చేయగా.. మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్ పాల్గొన్న ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సర్పంచ్‌కు కుర్చీ ఏర్పాటు చేయకపోవడం.. ఆమెను వేదిక పైకి పిలవలేదన్నారు. పైగా ఇది ప్రభుత్వ కార్యక్రమం కాదంటూ బీఆర్‌ఎస్ నేతలు బుకాయించడం సిగ్గుచేటన్నారు. తక్షణమే ఎమ్మెల్యే రాజయ్య బహిరంగ క్షమాపణ చెప్పకుంటే నిరసన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. దళిత మహిళా సర్పంచ్‌పై మొదటి నుంచి గ్రామంలో వివక్ష చూపుతున్నారని, ఈ విషయమై ఎస్సీ, ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమావేశంలో సర్పంచ్ అనూష, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు శిరీష్‌రెడ్డి, ఉపసర్పంచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన లేకుండా విమర్శలు సరికాదు



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: పూర్తిస్థాయి సమాచారం, అవగాహన లేకుండా విమర్శలు చేయడం సరికాదని రైతు సమన్వయ సమితి రంగరాయగూడెం కన్వీనర్ తోట వెంకన్న, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు నెలమంచ అజయ్‌రెడ్డి అన్నారు. గ్రామంలో చట్ల సురేష్‌గౌడ్ అధ్యక్షతన బుధవారం విలేకరులతో మాట్లాడారు. దాత పాల్వాయి వెంకట్‌రెడ్డి, లక్ష్మి దంపతులు రూ.30లక్షలు సొంత ఖర్చుతో అంగన్‌వాడీ కేంద్ర భవనాన్ని నిర్మించి గ్రామానికి అప్పగించారని, ఇది ప్రభుత్వ కార్యక్రమం కాదన్నారు. అయినా.. సర్పంచ్‌ను స్వయంగా పిలిచామని, ఆమె వేదికపై కూర్చున్న ఫొటోలు ఉన్నాయన్నారు. మంత్రిని సన్మానించే క్రమంలో ఆమె వేదిక దిగిందని, అప్పుడే ఎమ్మెల్యే రాజయ్య మాట్లాడుతుండగా సర్పంచ్‌తో పాటు తాము కాసేపు నిల్చున్నామని చెప్పారు. దీనిని రాద్ధాంతం చేయడం తగదన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ తోట అంజనేయులు, జాన్‌అబ్రహం, మంద ప్రభాకర్, మల్లయ్య, మోదంపల్లి మహేష్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

జగన్ మళ్లీ సీఎం కావాలని పూజలు



బచ్చన్నపేట: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి సీఎం కావాలని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర నాయకుడు బొడ్డు ప్రవీణ్ పూజ నిర్వహించారు. బుధవారం మండలంలోని కొడవటూర్‌లోని శ్రీ సిద్దేశ్వరాలయంలో కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏపీలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నుంచి సైకిల్ యాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు.

వైభవంగా లక్ష్మీనర్సింహస్వామి యజ్ఞం

జఫర్‌గఢ్: మండలంలోని తమ్మడపల్లి (జి)లో భజన బృందాలచే యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి సన్నిదిలో అఖండ లక్ష్మీనర్సింహస్వామి సంకీర్తనలు ప్రారంభించాలని అన్నమయ్య కళాక్షేత్ర పీఠాధిపతి విజయశంకరస్వామి యజ్ఞాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ తెలంగాణకు తలమానికమైన గొప్ప అధ్యాత్మిక సన్నిధి యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానమని అన్నారు. జానపద వృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండూరి భాస్కర్, గ్రామ సర్పంచ్ అన్నెపు పద్మ ఆశోక్, భక్తులు అకోజు యాదగిరి, దామోదర్, బీసీ పోరాట వేదిక రాష్ట్ర అధ్యక్షులు రామూర్తితోపాటు తదితరులు పాల్గొన్నారు.

యోగా జీవన విధానం కావాలి

జనగామ: యోగా ప్రతి ఒక్కరి జీవన విధానంలో భాగం కావాలని జిల్లా క్రీడల శాఖ అధికారి గోపాల్ రావు అన్నారు. జిల్లా కేంద్రంలో ఎర్త్, మేము సైతం ఫౌండేషన్ నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో సాన్ మారియా డైరెక్టర్ జగన్‌రెడ్డితో కలిసి జిల్లా క్రీడా, యువజన అధికారి గోపాల్ రావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాజు, కౌశిక్, అబ్బాస్, మహేష్ (చింటు), నర్సింహులు, నర్సింగ్, అనూష, ప్రేమ్‌దీప్, అబ్రహం పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కొడకండ్ల: కస్తూర్బా విద్యాలయంలో ఇన్‌చార్జ్ స్పెషలాఫీసర్ పేరం శారద ఆధ్వర్యంలో, అలాగే బీజేపీ కార్యాలయం వద్ద యోగాడేను నిర్వహించారు.

నర్మెట: మండలంలోని పాఠశాలల క్రీడా ప్రాంగణాలు, కార్యాలయాల్లో అధికారులు, అనధికారులు, విద్యార్థులు, ఏఎస్‌ఎంలు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, వీఓఏలు ఆసనాలు వేశారు.

జఫర్‌గఢ్: ఎన్‌ఎస్‌ఎస్ సేవా విభాగ్ ఆధ్వర్యంలో ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు యోగా ఆసనాలు వేశారు. అలాగే గీతాంజలి పాఠశాలలో విద్యార్థులచే యోగాసనాలు వేయించా రు. ప్రిన్సిపాల్ శ్రీకాంత్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు జానినాయక్, నర్సింగంగౌడ్ పాల్గొన్నారు.




జనగామ: యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రతీ రోజూ యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని స్థానిక విద్యాజ్యోతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ థామస్‌కిరణ్ అన్నారు. స్థానిక విద్యాజ్యోతి డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఘన్‌పూర్ ఈఓ సత్యనారాయణ, ఎన్‌సీసీ అధికారి బాలశౌర య్య, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

‘రామకృష్ణయ్య హత్య వెనుక ఎమ్మెల్యే హస్తం’

బచ్చన్నపేట: మండల పరిధి పోచన్నపేట గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎంపీడీఓ నల్ల రామకృష్ణయ్య హత్య వెనుక ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి హస్తం ఉన్నదని మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. బుధవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బచ్చన్నపేటలో భూఆక్రమణలు జరుగుతున్నాయని, అధికార పార్టీ నాయకులు ఎమ్మెల్యే అండతో రెచ్చి పోతున్నారని అన్నారు. హత్యా రాజకీయాలకు ఎమ్మెల్యే ముత్తిరెడ్డి సూత్రధారి కాగా.. హత్యలు చేయించే వారు పాత్రధారులు అయినారని పేర్కొన్నారు. రామకృష్ణయ్య హత్య జరిగి వారం రోజులవుతున్నా పలువురు నిందితులను పోలీసులు అరెస్టు చేయకుండా వదిలేశారని అన్నారు. హత్యపై రిటైర్డ్ హైకోర్టు జడ్జి చేత ప్రత్యేక కమిటీ వేసి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి, ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప, అసెంబ్లీ కన్వీనర్ బక్క శ్రీనివాస్, సద్ది సోమిరెడ్డి, కొంతం శ్రీనివాస్, ఎర్ర రామయ్య, గద్ద రాజు తదితరులు పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న నర్సయ్యగౌడ్

సంక్షిప్త సమాచారం

ఆర్థికసాయం

దేవరుప్పుల: మండంలోని ధారావత్‌తండాకు చెందిన నిరుపేద విద్యార్థి భూక్య వినయ్‌కు బీఆర్‌ఎస్ యువజన జిల్లా నాయకుడు బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్ సహకారంతో రూ. 5 వేల ఆర్థికసాయం అందజేశారు. బండారి రాములు, పానుగంటి గిరి, వెంకటేష్, నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ సంపత్, శేఖర్, రాజు, స్వామి నాయక్, బికోజి నాయక్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి..

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన చిన్నాల అభిసారిక మృతి చెందింది. కాగా, బుధవారం బీఆర్‌ఎస్ జిల్లా యువజన నాయకుడు బబ్బూరి శ్రీకాంత్ గౌడ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లేగ రామ్మోహన్‌రెడ్డి వేరువేరుగా కుటుంబానికి పరామర్శించారు. శ్రీకాంత్ గౌడ్ రూ. 10 వేల ఆర్థిక సాయం అందజేశాడు.

నీర్మాలలో..

దేవరుప్పుల: మండలంలోని నీర్మాలలో రాజోజు అంజనేయులు మృతిచెందగా ఆ కుటుంబానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రామ్మోహన్‌రెడ్డి పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు.


లింగంపల్లిలో..

బచ్చన్నపేట: మండలంలోని లింగంపల్లిలో ఇటీవల మృతి చెందిన చిలుక శ్రీశైలం కుటుంబ సభ్యులకు బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కిరణ్‌కుమార్‌గౌడ్ రూ.10వేల ఆర్థికసాయం బుధవారం అందజేశారు.

చైతన్య సభలను జయప్రదం చేయండి

తరిగొప్పుల: జిల్లా కేంద్రంలో ఈనెల 29,30న జరిగే రాష్ట్ర చైతన్య సభలను జయప్రదం చేయాలని కల్లుగీత కార్మికు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటమల్లయ్య అధ్వర్యాన బుధవారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో చైతన్య సభ కరపత్రాన్ని ఆవిష్కరించారు.

సమ్మె నోటీసు అందజేత



తరిగొప్పుల: గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేసి, జీఓ–60 ప్రకారం వేతనాలు పెంచి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని మండల పరిధిలో పలు గ్రామపంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘం జేఏసీ పిలుపు మేరకు సమ్మెనోటీసులను ఎంపీడీఓ జయరావుకు అందజేశారు. సంఘం అధ్యక్షుడు సాంబారి కృష్ణమూర్తి, రాంనారాయణ, రామచంద్రం, అక్తర్, భిక్షపతి, సాంబయ్య, మైసయ్య, పోషయ్య, రాజకొమురయ్య పాల్గొన్నారు.

సిబ్బందిని బదిలీ చేయండి

చిల్పూరు: చాలా ఏళ్లుగా ఆలయంలో పనిచేస్తున్న సిబ్బందిని బదిలీ చేయకపోవడంతో అవకతవకలు జరుగుతున్నాయని, కావున వెంటనే బదిలీలు చేపట్టాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు బుధవారం ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావుకు వినతి పత్రం అందజేశారు. గొల్లపల్లి వాసు, సారయ్య, తొటి సునీల్, యాట రాజు, గొల్లపల్లి సాంబశిరాజు, చిర్ర మల్లికార్జున్, కల్లూరి ప్రవీన్, సాము శంకర్, మూల సంపత్, పస్నీరు అశోక్, భాస్కర్ ఉన్నారు.


బహుమతుల ప్రదానం

జఫర్‌గఢ్: మండల కేంద్రంలో యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన జట్లకు బుధవారం బహుమతుల ప్రదానం చేశారు. ఈ బహుమతులను దాత, బీఆర్‌ఎస్ నాయకుడు ఇల్లందుల మొగిళి చేతుల మీదుగా అందజేశారు.

పద్మశాలీలకు బీసీబంధు ప్రకటించాలి

పాలకుర్తి టౌన్: పద్మశాలీలకు బీసీబంధు ప్రకటించాలని, రూ.లక్ష ఆర్థిక సాయం అందించాలని పద్మశాలి మండల అధ్యక్షుడు మాచర్ల సారయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బస్‌స్టాండ్ ఆవరణలో ఏర్పాటుచేసిన పద్మశాలి మండల సమావేశం ఆయన మాట్లాడారు.

అదృశ్యమైన వివాహిత ఆచూకీ లభ్యం



నర్మెట: మండంలోని ఇసుకబాయితండా ఆవాసప్రాంతం సంగడితండాకు చెందిన వివాహిత సునావత్ అరుణ తన ఇద్దరు కూతుర్లతో కలసి సోమవారం రాత్రి అదృశ్యమైన విషయం విధితమే. కాగా, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు బుధవారం వారి ఆచూకి లభించడంతో తండ్రి బానోత్ రాంసింగ్‌కు అప్పగించారు. కేసు నమోదు చేసిన 24 గంటల వ్యవధిలో మిస్సింగ్ కేసును చేదించిన పీసీలు ప్రవీణ్ కుమార్, దనుంజయ్‌లను సీఐ పాటి నాగబాబు, ఎస్సై గైకాడి అనిల్ కుమార్ అభినందించారు.